



"ప్రిన్సిపాల్‌గారి కుక్క చనిపోయిందట—"

ఓ వారం రోజులు డ్యూటీస్ నుండి సస్పెండ్ చేయబడ్డ ప్యూన్ నరసింహులు కా వార్త ఒంటిని తాకుతున్న మంటలా గవిపించింది.

వెంటనే ప్రిన్సిపాలింటికి పరుగెత్తు దామనుకున్నాడు. చనిపోయిన కుక్కగురించి బాహాటంగా ఏడ్చేందుకు..... కాని -

సస్పెండయి యింట్లో ఉండాల్సిన తను మళ్ళీ ప్రిన్సిపాల్‌గారి కండ్లబడితే అసలు ఉద్యోగమే తీయించేస్తేనో!....

ప్రిన్సిపాల్‌గారు 'రా' అని పూర్తిగా అనకముందే అతనిఎదుట ప్రత్యక్షం కాకపోయినా.... అనవసరంగా అతనిక్కనబడినా ఆ రోజు నరకం కనబడ్డట్టే.

నరసింహులు మనస్సు పెనం మీది పేలపు గింజలా ఉంది.

సరిగ్గా.... వారం క్రితం-తను.

కుక్కకు రాత్రి పడుకునేటప్పుడు పరుపువేయలేదు పక్కలో. ఎందుకో మరిచిపోయాడు. వారం రోజులు వరుసగా కూడు లేకపోయినా తాను మామూలు కుక్కలా పడుంటాడు గాని ... పరుపు వేయ

నందుకు ప్రిన్స్‌పాల్‌గారి కుక్క మాత్రం మహా భయంకరంగా అరిచింది.

కుక్క అరుపు విని.... ప్రిన్స్‌పాల్‌గారు దానికన్నా భయంకరంగా తనమీద అరిచాడు.

-ఫలితం.... కుక్క పక్కలో పరుపేయనందుకు ఓ వారం రోజులు సస్పెన్షన్.

....ఎందుకు సస్పెండ్ చేస్తున్నారు? అసలు నేను కుక్కలకూ, గాడిదలకూ పక్కవేసేందుకూ, పళ్లుతోమేందుకూ ఉన్నానా? కాలేజీలో పనిచేయాల్సిన నన్ను యింటిదగ్గర గాడిదలా వాడుకుంటున్న నక్కిరాపోయి-యింకా నన్ను సస్పెండ్ చేస్తావా-అని ఎన్నో.... ఇంకెన్నో అడుగుదామనుకున్నాడు నరసింహులు ప్రిన్స్‌పాల్‌గారిని.

కాని ఏదీ అడుగలేదు. సస్పెన్షన్ ఆర్డర్సును మహాప్రసాదంలా దోసిలితో తీసుకుని, నమస్కారం పెట్టి మరీ వచ్చాడు.

ప్చ్ ! మరి యిప్పుడు జరగాల్సిందేమిటి? తను కుక్క అంత్యక్రియలకు హాజరు కావాలా, వద్దా??

ఓ పావుగంటసేపు తోక కోసిన కుక్కలా గిజగిజలాడి కండువా భుజానేసుకుని, నరసింహులు తారాజువ్వలా బయలుదేరాడు ప్రిన్స్‌పాల్ గారింటికి.

ప్రిన్స్‌పాల్‌గారి యింటి ముందరంతా మంది.... గుంపులు గుంపులుగా. అంతా నిశ్శబ్దం. కాలేజీ కాలేజీఅంతాప్రిన్సిపాల్‌గారిఆవరణలోనే ఉంది!ప్రొఫెసర్లు. లెక్చరర్లు. రిజిస్ట్రార్, ఆఫీస్ స్టాఫ్ - ఇంకా ఎవరెవరో! అంతా పెద్దవాళ్ళే! గొప్పవాళ్ళే!

ఎందు కొచ్చినట్టు వీళ్ళందరూ? కుక్కచావుకేనా??

నరసింహులు.... తను ప్రిన్స్‌పాల్‌గారి కుక్కయి పుడితే ఎంత బాగుండేది అని అనుకున్నాడు లక్షా నూటా యిరవయోసారి-

బయట లాన్‌లో పచ్చగడ్డిమీద కుక్కను పడుకోబెట్టారుట చచ్చిపోయింతర్వాత. ప్రస్తుతం దాని దేహం కనబట్టంలేదు. శవం మీద ఆ కుక్కాభిమానుల్లా, ప్రిన్స్‌పాల్‌గారి సబార్డినేట్సూ వేసిన పూల గుచ్ఛాలుఓగుట్టలా కనిపిస్తున్నాయి. నిజంగా ఆ కుక్కగనుక బతికుంటే ఆ పూల బరువుకు తప్పకుండా చచ్చిపోయి ఉండేది.

కుక్క శవానికి అటుప్రక్కన ఫేము కుర్చీలో ప్రిన్స్‌పాల్‌గారు పెళ్ళాం చచ్చిపోయినప్పటి మగమనిషిలా అతి విచారంగా కూర్చున్నాడు.

అతని దగ్గరకు పోయి కుక్క చావుపట్ల సానుభూతిని వ్యక్తిగతంగా వ్యక్తపరిచే ధైర్యం అక్కడున్న వారెవరికీ లేదు. ఎవరికివారు పిసపిసలాడుతున్నారు.

'రామచంద్రం' అని పిలిచారు ప్రిన్సిపాల్‌గారు ఓ మనిషిని. అతి గంభీరంగా.

రామచంద్రం. ప్రిన్సిపాల్‌గారి కాలేజిలో తక్కువతరగతి గుమస్తా.

ప్రిన్సిపాల్ శివకామయ్యగారు కొత్తగా తమ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వచ్చిన రోజుల్లో పొరపాటుగా కాకుండా, సరిగానే యింగ్లీషులో శివకామయ్య పేరును రాస్తూ 'య్య' శబ్దానికి ఐఎహెచ్ ను నోట్‌లో రాస్తే 'వై వై ఏ' అని ఎందుకు రాయలేదని లనకు ఐదురూపాయలు పైన్ వేసిన సంఘటన రామచంద్రానికి ముఖం మీద మచ్చలా అనుక్షణం గుర్తుంటుంది.

రామచంద్రం - 'ఎస్సర్' అని అనడం పూర్తిగాకముందే ప్రిన్సిపాల్‌గారు "కుక్క అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయించు" అన్నారు.

మనుషుల అంత్యక్రియల సంగతిమాత్రం తనకు తెలుసుగాని, ఈ కుక్కగారి దేహయాత్రకు ఏర్పాట్లు చేసే విధానమెట్టిది-? అని రామచంద్రం గొణుక్కున్నాడు.

సరే—

చివరికి-ఓ గంటయిన తర్వాత.. జీపులో శునక శవయాత్ర మొదలైంది.

పూలగుట్టతో రథంలా సాగుతున్న జీపును కొత్తవారెవరైనా చూస్తే ఎవరో గొప్ప నాయకుడే తనువు చాలించినట్టున్నాడనుకుంటారు.

కాలేజి కాంపస్‌లోనే, ఓమూలకు ఊరేగింపుగా నడచి, ముఖాల్లో శోకముద్రలతో కుక్కను బండెడు పూలతో సహా సమాధి చేశారు.

అంతసేపూ ప్రిన్సిపాల్‌గారు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా... గంభీరంగా ఉంటూ అంతా గమనిస్తున్నాడు.

ప్రొపెసర్లందరూ ఎందుకో ప్రిన్సిపాల్ గారింటికెళ్ళారని లెక్చరర్లు, వాళ్ళెందుకు వెళ్తున్నారూ అని ఆఫీస్‌స్టాఫ్, ఆఫీస్ వాళ్ళను చూచి ప్యూన్లు. వీళ్ళందరినీ చూచి విద్యార్థులూ-కాలేజీ కాలేజీ తరలొచ్చింది.

తిరిగొచ్చి తోటలోని ఓ కుర్చీలో కూలబడ్డ ప్రిన్సిపాల్‌గారి ఎదుట వారి మనశ్శాంతి నిమిత్తమై, కుక్క ఆత్మశాంతి నిమిత్తమై సంతాపసభ తయారైంది.

ప్రొపెసర్లు మాట్లాడుతున్నారు.

చనిపోయినకుక్కగురించీకుక్కకూ తమకూఉన్న అవినాభావసంబంధం గురించీ, ప్రిన్స్‌పాల్‌గారు కుక్కతో ఇన్నాళ్ళూ పంచుకున్న ఆనందాన్ని గురించీ, ఇకముందు కుక్కను విడిచి అతను పొందబోయే దుఃఖంగురించీ ప్రసంగాలు నడుస్తున్నాయి.

ఉపన్యాసాలు గంటసేపు విన్న తర్వాత ప్రిన్స్‌పాల్‌గారు లేచారు- అతను సైకాలాజీలో డాక్టర్.

"ఫ్రెండ్స్! మనుషుల్లో మూర్ఖత్వానికీ, చదువుకూ సంబంధం ఉందా అని తెలుసుకునేందుకు ఈ కుక్కాయణాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నాను అప్పటినుండీ. చివరికి చదువుకూ, మూర్ఖత్వానికీ అసలే సంబంధం లేదని తేలింది! లేకుంటే యిందరు ప్రొఫెసర్లు, యింతమంది విద్యావేత్తలు-నా కుక్క చనిపోతే, కేవలం ఓ కుక్క చనిపోతే, నాకు మస్కాకొట్టేందుకు, నా మన్ననపొందేందుకు, నా అనుగ్రహాన్ని పొందేందుకు ఒకర్నిచూచి యింకొకరు కుక్కలకన్నా హీనంగా పరుగెత్తుకొస్తారా, అసలు డ్యూటీని వదలిపెట్టి? కాలేజిని విడిచిపెట్టి వీళ్ళందరూ ఎందుకిక్కడ కొచ్చినట్టో తెలుసుకోదలచుకున్నాను. రేపు .... వన్ ఫుడ్ ఫీల్ షైటు ప్లాటర్ ది పర్సన్ లైక్ దిస్. ఎదుట మనిషిని స్తుతించాలనా? దాంతో ఏదో బావుకోవాలనే ఈ అవలక్షణాలన్నీ, స్తుతికి లొంగిపోయేబలహీనతను మనిషి జయించే వరకూ ఈ పరిస్థితులు మారవు!"

వచ్చినవాళ్ళ ముఖాలు మసిముంతలైనాయి.

అందరూ సిగ్గుపడ్డారు. బంగారు ముద్దనుకుని ముట్టుకున్నది మన్నుల పాము చుట్టలేవో చేతిలో ఉన్నట్లుగా ఫీలయ్యారు ఎవరికి వారు,

నిశ్శబ్దంగా బయలుదేరారు ఒక్కొక్కరూ.

చివర్న—

చేతులు కట్టుకుని అతి వినయంగా- కుక్కకన్నా విధేయంగా ఎదుట నిలబడి ఉన్న నరసింహులును చూచి ప్రిన్స్‌పాల్‌గారు పిచ్చికుక్కలా అయిపోయారు.

"నేను సస్పెండ్ చేస్తానని యింటికి రావడమే మానేస్తావు? వెధవ! అసలు నువ్వు చేయబట్టే కుక్క చనిపోయిందివ్వాళ? నిన్ను ఉద్యోగంలోనుండి తీసేస్తున్నాను పో" అన్నాడు దూర్వాసునిలా.

నరసింహులుకేదీ అర్థం కావడంలేదు. అంతా పిచ్చిపిచ్చిగా ఉంది! అవాక్కయి కొయ్యబారిపోయి చూస్తూ నిలబడ్డాడు శిలలా.... *